# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-09-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఉగ్రవాదంపై ద్వంద ప్రమాణాలు ఆమోదయోగ్యం కాదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**

**2.** **అన్నమయ్య జిల్లాలో జరిగే పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొంటారు.**

**3.** **రాష్ట్రంలో అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

**4.** **రాష్ట్రంలో ఖరీఫ్ అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ సంచాలకులు ఢిల్లీరావు పేర్కొన్నారు.**

**4.** **ప్రముఖ తెలుగు కవి, సంస్కృత పండితులు పుట్టపర్తి నారాయనాచార్యులు వర్ధంతి ఈ రోజు.**

==========================

చైనాలో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ తియాన్‌జిన్ వేదికగా జరుగుతున్న 25వ షాంఘై సహకార సంస్థ–ఎస్‌సివో శిఖరాగ్ర సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఉగ్రవాదంపై ద్వంద ప్రమాణాలు సరికావని పేర్కొన్నారు. ఇటీవల పహల్గాం దాడి ఉగ్రవాదుల వైఖరిని చాటిందన్నారు. పహల్గాం దాడిపై భారత్‌కు మద్దతుగా నిలిచిన దేశాలకు కృతజ్ఞతలు చెప్పారు. ఉగ్రవాదాన్ని అన్ని దేశాలు ఖండించాలని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

అన్నమయ్య జిల్లాలో జరిగే పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు. జిల్లాలోని రాజంపేట మండలం బోయనపల్లె గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారుల ఇళ్లకే పింఛన్లు అందజేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా స్థానిక ప్రజలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. అనంతరం తాళ్లపల్లెలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సమావేశంలో ప్రసంగిస్తారు.

---------------------------

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని దీన్ దయాళ్ నగర్‌లో సామాజిక పింఛన్ల నగదును లబ్ధిదారులకు మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల మొత్తాన్ని పెంచి ఇస్తున్నామన్నారు. అర్హులైన వారు సంబంధిత అధికారుల వద్ద వివరాలను నమోదు చేసుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. పార్వతీపురం మన్యం జిల్లా బూర్జ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఏలూరులోని రామకృష్ణాపురంలో స్థానిక శాసన సభ్యులు బి.రాధాకృష్ణయ్య లబ్ధిదారులకు పింఛన్ నగదును పంపిణీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 17 వేల మందికి ఫించన్లను పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి తెలిపారు. అలాగే అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు డి.వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

..వాయిస్... 30 సెకన్లు

---------------------------

పశ్చిమగోదావరి జిల్లాలోనే గణపవరం మండలాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గణపవరం మండలంలోని 25 గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు కేంద్ర మంత్రిని కలిసి ఈమేరకు భీమవరంలో నిన్న వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం గణపవరం మండల రెవెన్యూ, పోలీస్ వ్యవస్థ కూడా భీమవరం డివిజన్ పరిధిలోనే కొనసాగేలా చూడాలని కోరారు.

---------------------------

తిరుపతిలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రహదారులను నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ – తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి తెలిపారు. తిరుపతిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఖరీఫ్ అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ సంచాలకులు ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు సెప్టెంబరు నెలకు 1.55 లక్షల టన్నుల యూరియా అవసరం కాగా.. 1.59 లక్షల టన్నుల్ని కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ఆగస్టు అవసరాలకు కేటాయించిన పరిమాణంలో ఇంకా 82 వేల టన్నులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్, ప్రైవేటు దుకాణాలు, రైతు సేవా కేంద్రాలు, కంపెనీల గోదాములు, హోల్‌సేల్ డీలర్లతో కలిపి లక్షా 8 వేల 852 టన్నుల యూరియా అందుబాటులో ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

---------------------------

ప్రముఖ తెలుగు కవి, సంస్కృత పండితులు పుట్టపర్తి నారాయనాచార్యులు వర్ధంతి ఈ రోజు. సంగీతం, సాహిత్యం మూర్తీభవించిన వ్యక్తిత్వం పుణికిపుచ్చుకున్న ఆయన 1914వ సంవత్సరం మార్చి 28వ తేదీన అనంతపురం జిల్లాలోని చియ్యేడు గ్రామంలో జన్మించారు. ఆధునిక మహా కావ్యంగా పండితులు, మేధావులు అభివర్ణించే "శివతాండవం కావ్యాన్ని" ఆయన రచించారు. పుట్టపర్తి నారాయణాచార్యులును తెలుగు సాహితీకారుల్లో అగ్రగణ్యుడు, బహుభాషా కోవిదుడుగా పేర్కొంటారు. కవిత్వంతో పాటు విమర్శనా రంగంలోనూ అనన్య సామాన్యమైన ప్రతిభ కనబరచిన పుట్టపర్తి నారాయణాచార్యులు 1990 సెప్టెంబర్ ఒకటవ తేదీన తుది శ్వాస విడిచారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 24వ తేదీ నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబర్ 23వ తేదీ సాయంత్రం అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 16వ తేదీన ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నామని తెలిపింది. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయని పేర్కొంది.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 430 పాయింట్ల లాభంతో 80 వేల 240 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 150 పాయింట్ల లాభంతో 24 వేల 577 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

వాయువ్య బంగాళాఖాతంలో రేపు అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాగల మూడు రోజులపాటు అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ

వాయిస్ ..28 సెకన్లు

---------------------------

చిత్తూరు జిల్లాలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు రేపటి నుంచి ఈనెల ఏడో తేదీవరకు వైద్య పరీక్షలను నిర్వహించనున్నామని జిల్లా ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో జరిగే ఈ వైద్య పరీక్షల కోసం అభ్యర్థులు ఆయా తేదీల్లో ఉదయం ఆరు గంటలకు పాత పోలీసు కార్యాలయం వద్దకు చేరుకోవాలని తెలిపారు. వైద్య పరీక్షల కోసం వచ్చే అభ్యర్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకురావాలని సూచించారు.

=====================